# సంఘ జీవితం

శ్రీమతి రుక్మిణీగోపాల్

"ఏమిటే నీగోల? ఇప్పుడు నీ వింతకీ చెప్పేది ఇల్లు మార్చమనేనా?"

"మీరు తెలిసుండి కూడా, తిరిగి నన్నెందుకు ప్రశ్నించటం?"

"పెంకి సమాధానాలు చెప్పటం మట్టుకు మా బాగా తెలుసు. నీకిప్పుడు ఇక్కడ వచ్చిన లోటేమిటి?"

"మళ్ళీ రెడ్డొచ్చె మొదలా? నేనీ ఉమ్మడి మట్టుకు భరించలేకుండా ఉన్నాను. తెల్లవారింది మొదలు చీపురు కట్టా, అలుకుగుడ్డదగ్గరనుంచి గొడవే. ఏదో సామెత చెప్పిన మోస్తరుగా అత్తపోరు లేదు, మామపోరు లేదు, మధ్యన వీళ్ళపోరేమిటి? అయినా ఇటువంటి వన్నీ వస్తాయని నేను మొదటనే చెప్పాను మనకీ ఉమ్మడి వద్దని"

"నీవు చెప్పటానికేంలే, అసలు మన వాళ్ళకు సంఘజీవితమనేది తెలియదు. ఎంతసేపూ, కూపస్థమండూకాలలాగ ఒక చోటే ఉండటం మూలాన్ని ఇతరులతో ఎలా గడుపుకోవాలో తెలియదు. మానవుడు ఒంటరిగా ఎప్పుడూ బ్రతకలేడు. మనకు జీవితంలో భిన్నాభిప్రాయాలు, విభిన్న స్వభావాలు గల అనేకమందితో పరిచయమౌతుంది. అందుచేత గడుపుకోటం నేర్చుకోవాలి. అంతేగాని "నాకు ఎవరితోటి పడదు. ఒంటెత్తు రామలింగంలాగ నేనొక్కర్తెనే ఉంటాను" అంటే ఈ పట్టణాలలో ఎవరికీ కుదరదు."

"మీరు చెప్పిందంతా బాగానే ఉంది. నేను కాదనను. కాని ఈ గడుపుకోవా అన్నది ఇరుపక్షాల ఉంటే బాగానే ఉండును. కాని ఎంతసేపు ఒకళ్ళే గడుపుకోవాలంటే కష్టంకాదూ. మీరు చూస్తూనే ఉన్నారుగా. అనవసరంగా ఎందుకు గొడవ అని ఎన్నివిధాల ప్రయత్నించినా గొడవ తప్పటంలేదు. అయినా ప్రయత్నించిన తరువాత ఒక్కళ్ళు ఉండటం సాధ్యం కాకపోతే జంటగానే ఉండవచ్చు. కాని ప్రయత్నించకుండా మొదటినుంచి కూడా జంటగానే ఉండాలన్న ఈ విపరీత సిద్ధాంతమేమిటి?"

హేమయొక్క ఈ మాటలు వినేటప్పటికి రామానికి విసుగు, కోపము కూడా వచ్చాయి.

"నీ బుర్ర అంతవరకూనే పనిచేసిందన్న మాట. అసలు సంఘజీవితమువలన చాలా లాభాలున్నాయి. విదేశాలలో చిన్న పిల్లల దగ్గర నించి ఏ 'కిండర్ గార్డెన్స్' లోనికో పంపించివేస్తారు కాని ఇంటిలో కూర్చోపెట్టుకోరు. అందుచేత అప్పటి నుంచీ కూడ వారికి సంఘజీవితం అలవడుతుంది. ఇంక ఇక్కడ మన దేశంలోనో!— అమ్మమ్మల పెంపకమూనూ, నాయనమ్మల పెంపకమూనూ. గారాం చేసి, పెంకితనం నేర్పటం తప్ప ముందు జీవితంలో ఉపయోగపడేవి ఏమీ నేర్పరు. అందుచేతనే మన దేశ మిలా తగులడుతోంది."

"నిజమే, మీ ఆశయాలతోటి నేను పూర్తిగా ఏకీభవిస్తాను. కాని ప్రస్తుతం మన దేశ పరిస్థితులను మీరు గమనించటం లేదు. అక్కడ గడిపినట్లు మన మిక్కడ సంఘజీవితమును గడపలేము. అక్కడ ఒక కుటుంబముయొక్క గృహాసంబంధమైన విషయాలలో ఇంకొక కుటుంబం అనవసరంగా కలుగచేసుకోదు. ఇక్కడ అలా కాదు. ఎంతమాత్రం తీరుబడి ఉన్నా ఇతరుల గొడవే! ఈ విధమైన వాళ్ళతో మనకు సంఘజీవితమేమిటి?"

రామానికి ఆఫీసుకు టైమ్, అయిపోయింది. అందుచేత ఇక వాదన ఆపుచేసి త్వరగా భోజనం ముగించాడు. హేమ ఇచ్చిన పాన్‌బీడా తీసుకుని ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

> ఇరుగూపొరుగూ నలుగురితోనూ సర్దుకుంటూ పోతూ సమాజంలో కలిసి జీవించడం ఎలాగూ తప్పదు. కాని సర్దుకుపోవాలనే భావం ఒకరికుండి మరొకరికి లేకపోతే జీవితం కష్టభాజనమై పోతుంది. అలా సంభవించినప్పుడు ఏంచెయ్యాలి?

* * *

హేమ పెళ్ళయి ఆరు సంవత్సరాలైంది. కాని పెండ్లయిన రెండు సంవత్సరాలకే రామం ఇంగ్లండు చదువుకు వెళ్ళిపోయాడు. మూండేండ్ల తరువాత తిరిగి వచ్చాడు. ఈ మూడేండ్లలోను అతని జీవితంలో గొప్ప మార్పు కలిగింది. పాశ్చాత్య నాగరికతలతని రోమరోమానికి అంటిపోయినవి. నాలుగు నెలలక్రిందటే అతనికి బొంబాయిలో ఉద్యోగం దొరికింది. ఒక స్నేహితునితో కలిసి జాయింటుగా ఒక ఇల్లు తీసుకున్నాడు. ఇద్దరు చెరొక వాటాలో ఉంటున్నారు.

హేమకు ఈ విధంగా జాయింటుగా ఇల్లు తీసుకోవటం మొదట్లో ఇష్టం లేకపోయింది కాని తప్పనిసరి అయింది. ఇంగ్లండు వెళ్ళివచ్చిన తరువాత రామం దృష్టిలో "దేశ దౌర్భాగ్యాలలో" ముఖ్యమైంది ఇక్కడివాళ్లు సంఘజీవితమును గడపలేకపోవుట అని తోచింది. అందుచేతనే హేమ ఎంత పోరినా వినక జాయింటుగానే ఇల్లు తీసుకున్నారు. అంతేకాక ఈ రెండు కుటుంబములకు ఒకే వంటయిల్లు, ఒకే చదువుకునే గది. ఒకేచోట భోజనములు మొదలగు ఏర్పాట్లను చేద్దామని తలిచాడు. కాని కొన్ని కారణాల చేత అది సాగలేదు. ఒకే నౌకరును, ఒకే దాసీ మనిషిని మాత్రం పెట్టగలిగేడు. వీరిద్దరే మధ్య మధ్య ఆ గృహిణుల చిన్న చిన్న తగవులకు కారణ మవసాగేరు. హేమకు, రామానికి మనసు మనసు అయితే కలిసింది కాని, మాటా మాటా కలవలేదు. ఈ జాయింటుకాపరం హేమకు ఎంత మాత్రం ఇష్టం లేదు. దానివల్ల లాభాల కంటే నష్టాలు ఎక్కువగా ఉంటాయని హేమ అభిప్రాయం. ముఖ్యంగా గృహసంబంధమైన అనేక విషయాలు రహస్యమైనవి, కొన్ని కూడ ఇతరులకు తెలియకూడదని ఆమె అభిప్రాయం. కాని కలసి ఉన్నప్పుడు ఇది జరగదని ఆమెకు తెలుసు.


## శతమూలికాదిలేహ్యము

లోహాభ్రకసింధూరముతో సహా సేవించిన సమస్తసుఖవ్యాధులు, ఎఱుపు తెలుపు మచ్చలు, బగ్గలు నపుంసకత్వము నివారించి వీర్యవృద్ధి, బలము, నరముల పటుత్వము కలుగజేయును స్త్రీలఋతుశూలలు, కుసుమరోగములు, నష్టసంతానము నివారించి మంచిసంతానము కలుగజేయును. 40 దినములకు మందు రు 18.

## శ్రీ భుజంగరాడ్వైద్యశాల

తాళ్ళరేవు, తూర్పు గోదావరి జిల్లా.

ఆమె ఇదివరకు ఇటువంటి ఘట్టాలు చాలా చూసింది. నలుగురు అమ్మలక్కలు మధ్యాహ్నంపూట పని తీరుబడి చేసుకుని, లేక పోతే కొన్ని పనులైనా వదిలేసి ఒకరింట్లో గుమిగూడతారు. అక్కడనుంచి ఇరుగు పొరుగుల ఇండ్లలోని విషయాలను గురించి చర్చ ప్రారంభిస్తారు. "కావమ్మగారింట్లో ఎన్నడో ఒకనాడు తప్పవిడిచి రోజూ కూర వండుకోరు—ఆయన అట్టే సంపాదన పరుడు కాడట" అని అంటుంది ఒక స్థితి మంతురాలు. "వాళ్ల రాజేశ్వరి, తండ్రి చూసిన సంబంధం చేసుకోనని నిక్కచ్చిగా చెప్పేసి, జానకమ్మగారి అబ్బాయి మధుసూధనరావు నే చేసుకుంటానందిట, అంత అలా సిగ్గువిడిచి తండ్రితో ఎలా చెప్పిందే అమ్మా! నేనయితే చచ్చిపోదును గాని అలాంటి సిగ్గుమాలిన మాట నోటి వెంట రానీను" అని అంటుంది ఒక మానవతి. "విన్నావా?—వాళ్ల సుభద్రమ్మ గారి అమ్మాయిని పురుడువచ్చిన నెలలోపలనే మొగుడువచ్చి తీసుకు పోయాడుట, మూడోనెల వచ్చేవరకైనా అట్టిపెట్టలేదుట. కాలమహిమ!" అంటుంది ఒక జ్ఞానురాలు. ఈ చర్చలలో అప్పుడప్పుడు చిన్న చిన్న తగవులాటలు సంభవించి మన మాట నెగ్గింది కాదన్న ఉడుకు మోతుతనము, ఏడుపును సూచించు కళ్ల ఎర్రదనము, ముక్కులోని పల్చదనము మొదలగునవి సంభవిస్తాయి. ఆఖరికి "కావయ్యగారి కంటె చిన్నదా పెద్దదా" అను చిన్నవాదనలు పెద్దవాటిలోకి దారితీసి చూపులు, మాటలు లేక పోవడంలోకి పరిణమిస్తాయి.

ఈ ఘట్టములన్నీ చూస్తున్న హేమకు ఒకరితో జంటగా కలసిఉండటం నచ్చలేదు. ఇరుగు పొరుగు ఇండ్లకు పెత్తనాలకు వెళ్లటం కూడా ఆమెకు ఇష్టం లేదు. తీరిక సమయములలో చదువుకుంటూ కాలము గడిపేయటం ఆమె పద్ధతి. ఇంత మాత్రం చేత హేమ సంఘజీవి కాదని, ఆమె ఇతరులతో కలసిమెలసి ఉండదని అనుకోకూడదు. ఆమె తోటివారితో చాలా సరదాగాను, చలాకీగాను ఉంటుంది. అతి పరిచయం చేసుకుని, అనవసరపు గొడవలు తెచ్చుకోటం ఆమెకు నచ్చదు. ఒకప్పుడు ఆమె "చదువు లేని అజ్ఞానులతో కాని ఇటువంటి అనవసరపు గొడవలు రావని" తలచింది. కాని ఈ కొత్త ఇంటిలో కాపరం పెట్టిన తరువాత ఆమెకి సందేహం తీరింది. ప్రక్కవాటాలో నున్న నారాయణరావు గారి భార్య— రాజేశ్వరి ఇంటర్మీడియెట్ పాసయింది. అందుకే ఆమె చాల గర్వపడి పోయేది. ఈ గర్వమునకు, ఆమెకున్న "స్వల్ప ఆస్తి" కూడ సాయపడింది. హిందీ విశారద మాత్రమే పాసైన హేమ ఆమె దృష్టిలో విద్యాహీనురాలిలాగ కనపడేది. హేమ తలితండ్రులు సనాతనులగుటచే, ఆమెకు ఆంగ్లవిద్యను నేరిపింపలేదు. ఈ కారణముచేత రాజేశ్వరి హేమకంటె తా నధికురాల ననుకునేది.

* * *

ఆనాడు రామం ఆఫీసుకు శలవు. అప్పుడే వర్షం కురిసి వెలసింది. మధ్యాహ్నం మూడుగంట లయింది. హేమ కుంపటి అంటించి కాఫీకి నీళ్లు పడేసింది. రామం కూడ హేమతో ఏవో కబుర్లు చెప్తూ వంటింట్లోనే కూర్చున్నాడు. నీళ్లు మరిగిన తరువాత డికాక్షన్ వేసింది. కుంపటి ఊరికే ఉండిపోతుందిగదా, కూర పడేసి మరీ కాఫీ కలుపుదామని కూర తరగ నారంభించింది. కాఫీ సామానంతా కుంపటిదగ్గర అదివరకే రెడీగా పెట్టింది. ఇది చూసి రామం కాఫీ కలప నారంభించాడు. ఒక కప్పు తను తీసుకుని ఒకటి భార్య కిచ్చి, "చల్లారిపోతుంది త్వరగా తాగ"మన్నాడు. ఇదంతా తమ వంటింట్లో కూర్చొని కాఫీ కాస్తున్న రాజేశ్వరి చూచింది. రామం భార్యాలోలుడని, ఆమెకు అన్నివిధాలా సాయంచేస్తాడనీ తలచింది. ఆమెకు ఇది చాలా విచిత్రంగా కనపడింది. అమాయకుడైన రామంమీద ఆ విధంగా అధికారం చెలాయిస్తున్న హేమ

(39-వ పేజీ చూడండి)



# సంఘజీవితం

(17-వ పేజీ తరువాయి)

చర్య ఆమెకు ఎంతమాత్రం నచ్చలేదు. దీనికి సాయం తనకు తన భర్త అలా సాయంచేయకపోవటంకూడ ఆమెను చాలా బాధించింది. ఏదో విధంగా హేమ తప్పును హేమకు తెలియపరచాలని ఆమె అనుకుంది.

ఆ సాయంత్రం పనులన్నీ అయిన తరువాత హేమ, రాజేశ్వరి కలసి వరండాలో కూర్చొని కబుర్లు చెప్పుకోడం మొదలు పెట్టారు. మాటలసందడిలో రాజేశ్వరి అంది — "ఎనిమిదిన్నరకే వంట చేసేటప్పటికి నా తలప్రాణం తోకకు వస్తోందండి. అందులో మావారికి ఎందులోను గడ్డిపరకంత లోటుకూడ రాకూడదు. ఆయన వంటింట్లోకి వచ్చేటప్పటికి కంచము, పీట, గ్లాసు రెడీగా ఉండాలి." 'చెయ్యి ఊరుకోలేదు, కొంచెం, ఆ కంచం ఇలా పెట్టుకుందురూ' అంటే ఆ కంచం పెట్టుకుందుకు తొంభై సాధిస్తారు. ఎలాగా, మీ వారు అలా కాదు. కొంచెం సర్దుకుంటారు. ఇందాకా, ఆయన కాఫీ కలిపి, ఆయన త్రాగి, మీ కివ్వటం చూస్తే నాకు చాలా ముచ్చటేసింది కాని మా అన్నగారి మెత్తదనం చూసి రేపు వంటకూడా చేయిస్తారేమోనని భయంగా ఉంది."

రాజేశ్వరి మాటలు వినేటప్పటికి హేమకు చాలా కోపమొచ్చింది. రాజేశ్వరి ఎందుకిలా అంటోందో కూడా తెలుసుకుంది. "ఎలాగా మా వారి పద్ధతి వేరు. మగవాళ్లకి మల్లే, ఆడవాళ్లని బానిసల్లా చూడాలని, ఏ మాత్రం లోటువచ్చినా సహించకూడదని ఇంటిపనులలో వారికి ఏమాత్రం సాయపడినా తమకి అవమానమని తలచే రకం కాదు. నే నదృష్టవంతురాలిని కాబట్టే నాకు అటువంటి భర్త లభించాడు" అంది.

ఈ మాటలు వినేటప్పటికి రాజేశ్వరి ముఖం తెల్లబడిపోయింది. హేమ ఇలాంటి సమాధానం ఇస్తుందని మొదట అనుకోలేదు. ఇంక ఏమీ అనలేక ఒక కృత్రిమ మందహాసంతోటి తన భావాల్ని కప్పిపుచ్చింది. రాజేశ్వరికి అలా సమాధానం చెప్పిందే కాని ఆమె అన్న మాటలు హేమని చాలా బాధ పెట్టాయి. కాని ఈ సంగతిని ఆమె భర్తకు మాత్రం తెలియ చెప్పలేదు.

రాజేశ్వరి హేమ, పైకి నవ్వుతో చాలా సరదాగా మాట్లాడుకుంటున్నారే కాని అనేక విధములైన సంఘటనలచేత ఒకరి మీద ఒకరికి కావలసినంత ద్వేషం ఉంది.

ఆ యింటికి ఒకటే కుళాయి ఉంది. రెండు ఇళ్లవారికి వాడుకునేందుకు అవే నీళ్లు. ఆ నీళ్ల వాడకములో తరుచు ఇద్దరికీ కీచులాట జరిగేది. రాజేశ్వరికి ఇద్దరు పిల్లలు. వాళ్ల ముసలి అత్త మామలు కూడ వాళ్ల దగ్గరే ఉంటున్నారు. వాళ్ల ఇంట్లో ఎక్కువ జనం ఉండుటచేత హేమకు ఎప్పుడు నీళ్లు తెచ్చుకుందామన్నా కుళాయి ఖాళీగా ఉండేది కాదు. ఈచిక్కు మాత్రం హేమకు భరించరానిదిగా ఉండేది. ఇంతే కాక రాజేశ్వరి కొంచం బద్ధకస్తురాలు. ఎంగిలి కంచాలు అవీ కుళాయి దగ్గర కడిగి ఆ మెతుకులూ, తుక్కూ అలా వదిలేసేది. ఇది చూస్తే హేమకు చాలా అసహ్యం వేసేది. హేమ స్వతహాగా ఎప్పుడూ శుభ్రంగా ఉంటుంది. ఇంటిని కూడ అలాగే ఉంచుతుంది. కుళాయి కింద బిందె పెట్టుకుని నీళ్లు పట్టుకోవాలి అంటే ముందు కింద శుభ్రం చేసుకుని మరీ పట్టుకోవలసి వచ్చేది. ఒకటి రెండు సార్లు రాజేశ్వరితో అలా మెతుకులు పోయవద్దని చెప్పింది. రాజేశ్వరి ఏదో వంక చెప్పేది. "పిల్లాణ్ణి మంచంమీద పడుకోబెట్టివచ్చాను. ఏడుపు వినిపిస్తే క్రిందకు పడిపోతాడని భయంవేసి పరుగెత్తికెళ్లాను" అనో, లేకపోతే "పిల్లి వంటింట్లో కెళ్లటం చూశాను. పాలు మూత లేకుండా క్రింద ఉన్నాయి. దాన్ని కొడదామని తొందరగా వెళ్లిపోయాను. ఆ తొందరలో మర్చిపోయాను" అనో అనేది. ఈ కారణాలు విన్న తరువాత హేమ ఇంకేమీ అనలేకపోయేది. అయినా ఇంకా గట్టిగా అని దెబ్బలాట పెంచుకోటం హేమ కిష్టం లేదు. ఆ దెబ్బలాటలు మొగాళ్లవరకూ కూడా వెడతాయి. అక్కడి నుంచి ఫలానా ఆవిడ మంచిది కాదని దెబ్బలాడుతుందని అంతా అనుకుంటారేమోనని భయపడేది.

ఇతరులకు తెలియని ఇటువంటి లోపాలు అనేకం ఉండేవి. రామంతో చెప్పితే లక్ష్యపెట్టేవాడు కాడు. "గడుపుకోటం నేర్చుకోలేని వాళ్ళ బ్రతుకు ఎక్కడికెళ్లినా ఒకటే" నని విసుక్కునేవాడు. అంతే కాని ఆ గడుపుకోటం ఎలాగో అతను చెప్పలేకపోయేవాడు. పాపం, హేమ ఇంకేమీ చెయ్యలేక ఊరుకునేది.

ఒకనాడు నౌకరు రాలేదు. హేమ ఉన్న వాటాకి కుళాయి చాలా దూరము. నౌకరు రెండుపూటలా నీళ్లు తీసుకువచ్చి బాత్ రూమ్‌లో నిలవచేసేవాడు. వాడు ఒక పూట రాకపోతే ఆ ఉన్న నీళ్ళతో ఎలాగో గడుపుకున్నారు. కాని వాడు రెండవపూట కూడ రాలేదు. ఇంక నీళ్ల మోత తప్పనిసరి అయింది. హేమ నీళ్లు తీసుకువచ్చి నింపటం మొదలుపెట్టింది. ఈ పనిలో రామంకూడ కొంత సాయపడ్డాడు. ఈ ఘట్టాన్ని చూచిన రాజేశ్వరి


బదరీనారాయణ (బ్రహ్మకపాళం)

దర్శించు యాత్రికులకు మంచి తరుణము.



లక్ష్మీ యాత్రా స్పెషల్

స్పెషల్ రైలుపెట్టెలో మా 4 వ ఉత్తర దేశయాత్రయిది.

4-4-52 న రాజమండ్రినుండి బయలుదేరును

45 క్షేత్రములు 54 రోజుల ప్రయాణం

4000 మైళ్ళు భూప్రదక్షిణము

టిక్కట్టు, 2 పూటలు భోజనము, వసతులతో సహా రు 295-0-0 మాత్రం. కొద్ది సీట్లుమాత్రమె కాళీవున్నవిగాన త్వరగా మ 1 కి రు 45-0-0 పంపి సీటు రిజర్వు చేసుకొనవలెను.

పూర్తి వివరములకు యీదిగువ యడ్రసుకు వ్రాయండి :

మేనేజరు : లక్ష్మీప్రెస్, కంభంవారి సత్రంవీధి, రాజమండ్రి.

మనస్సులో విపరీతమైన బాధ ననుభవించింది. హేమను దప్పి పొడిచే సమయం ఎప్పుడు వస్తుందా అని కనిపెట్టుకుని కూర్చుంది.

ఒకనాడు రాజేశ్వరి హేమ, ఇద్దరూ మాటాడుకోటంలో హేమ అంది— "మీ కంటే మాకు నీళ్లకు ఎక్కువ ఇబ్బంది. ఒక్కపూట నౌకరు రాకపోతే చచ్చినట్లు అంతదూరం మోసుకెళ్లాలి." ఈ మాటలు వినేసరికి సమయం ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న రాజేశ్వరి. — "నౌకరు రాకపోయినా మీకేమి ఫరవాలేదు. మీ ఆయనే మోస్తారు" అని చటుక్కున అనేసింది. ఈ మాటలకు హేమ చాలా నొచ్చుకుంది. ఆమె దీని కేమీ సమాధానం చెప్పలేకపోయింది.

ఆ రాత్రి భర్తతో హేమ, రాజేశ్వరి అన్న మాటలు చెప్పింది. ఆ మాటలు వినేసరికి రామానికి తగనికోపం వచ్చింది. ముఖం జేవురించి, కళ్లు ఎఱ్ఱబడ్డాయి. అప్పు డతని ముఖం చూసి హేమకూడ చాలా భయపడి ఎందుకు చెప్పానా అనుకుంది.

"ఆ మాటలు విని తగిన సమాధానం చెప్పకుండా ఊరుకున్నావా? రేపు ఆవిడతో "మీ మాటలకు ఆయనకు చాలా కోపం వచ్చింది, ఇంకొకసారి ఇటువంటి తెలివి తక్కువ మాటలంటే నారాయణరావు గారితో చెప్తానని, చెప్పమన్నారని" చెప్పు. నీ భర్తని అన్నందుకు నీకు ఏ మాత్రం, సిగ్గు, అభిమానమున్నా నీవు రేపు తప్పకుండా ఆవిడతో నే చెప్పినట్లు చెప్పు" అని ముక్కుడిప్ప లెగరేస్తూ, కళ్లు మరింత పెద్దవి చేస్తూ (అసలే పెద్దవి) గుక్క తిప్పుకోకుండా అన్నాడు.


"ఇది అంతా సంఘజీవితముయొక్క లాభములు. అయినా సంఘజీతమంటే పై అనేక విషయములలో ఉండొచ్చు. కాని నిత్యగృహకృత్యములలో కూడ ఎలాగ కుదురుతుంది?"

అందరి అభిప్రాయాలు ఎప్పుడూ ఒక్కలా ఉండవు. మనము మహదాశయములుగా పెట్టుకున్న కొన్నిటిని కొందరు అతి తుచ్ఛముగా భావిస్తారు. మనకు చెడ్డగా తోచిన కొన్నిటిని ఇతరులు మంచిగా భావిస్తారు. "ఇంటిగుట్టు లంకకు చేటు" అన్నట్లు ఇంకొకళ్లతో కలసి ఉంటే మన రహస్యాలేవీ దాగవు. కేవలం వాళ్లకి తెలిసి అంతటితో పోవు. మరునాటికి జగద్విఖ్యాతాలవుతాయి "ఒకళ్ల ఇంట్లో జరిగే వాటితో మనకెందుకు గొడవ" అని ఊరుకునే స్వభావం మనలో లేదు. ఇటువంటి స్వభావా లు కేవలం చదువుకోని స్త్రీలలో మాత్రమే ఉంటాయని, వాళ్లు ఎంతసేపూ ఎదుటవారింట్లో కూరను గురించి, వెనకవారింట్లో పప్పును గురించి మాత్రమే మాట్లాడుకుంటారని నే నింతవరకు అనుకుంటున్నాను. కాని ఈనాడు స్వానుభవం మీద ఈ విషయంలో చదువుకున్నవారు, చదువుకోనివారు కూడ ఒకటేనని తెలుసుకున్నాను. చదువుకున్న విజ్ఞానులు ఇక తను చదువును ఎందుకు వినియోగపరుస్తారో! అయినా ఈ మాటలు రేపు ఆవిడతో ఏమని చెప్పను?" మాశాను కాబట్టి అన్నాను. నే నేమైనా అబద్ధమాడేనా! అయినా ఆయనని నేనేమి దూషించలేదు. పైగా మంచిపని చేస్తున్నందుకు సంబరపడ్డాను కూడాను" అంటుంది. ఇంకే మనమంటారు?

"అయినా ఇద్దరు ఆడవాళ్లు ఎక్కడ కూడితే అక్కడే గొడవ. మా మొగాళ్లకిలాంటివేమీ ఉండవు."

"ఆ, ఆడవాళ్లను అంత తీసిపారెయ్యకండి. ఇంటిపనులన్నీ మీరు నిర్వహిస్తున్నప్పుడు పనివాళ్లతోటి, ఇరుగు పొరుగు వాళ్లతోటి మీకూ గొడవలు వస్తాయి. ఇప్పుడవేవీ లేకుండా వీధి గదిలో కుర్చీలో కూర్చుంటారు. కాబట్టి గొడవలు లేవు. అయినా వీటిలో మీ మొగాళ్లు మట్టుకు ఏం తీసిపోయారు? మీలో మీకు ఉన్నాయి గొడవలు— "రామారావు అలాంటివాడని, సుబ్బారావు ఇలాంటి వాడని" అవన్నీ మనసులో ఉంచుకుని పైకి 'హల్లో', అంటే హల్లో' అనుకుంటారు. మేమూ అంతే!"

రామం దీనికేమీ సమాధానం చెప్పలేదు. కాని ఆ మరునాటినుంచి ఇంకొక ఇల్లు చూడ సాగేరు. *



ఎదిగే పిల్లల

సంక్షేమానికి అతి ప్రధానం

పిల్లలు చురుకుగా, పుష్టికరంగా ఎదుగుటకు విటోఫెర్రిన్ పోటిలేని సాధనం రక్తక్షీణత, విటమిన్ లోపం, అన్ని రకాల నీరసాలతో బాధపడు వారికి ఇది మంచి టానిక్ గా పనిచేస్తుంది.

# విటోఫెర్రిన్

ఉత్పత్తిదారులు:

ది మైసూరి ఇండస్ట్రియల్ & టెస్టింగ్ లాబరేటరీ లిడ్.

మల్లేశ్వరం, బెంగుళూరు.

సెల్లింగ్ ఏజెంట్లు:

బెస్ట్ అండ్ కంపెనీ లిమిటెడ్.

పోస్ట్ బాక్స్ నం 63, మద్రాసు.

ES-36 TG